క్లుప్తంగా

కాంగ్రెస్ పాలనలో అక్రమ అరెస్టులు



వెంకటాపురం(ఎం): కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో అక్రమ అరెస్టులు కొనసాగుతున్నాయని, అక్రమ అరెస్టులతో పోరాటాలను ఆపలేరని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు అంతటి రాము విమర్శించారు. ఆసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించడాన్ని ఖండిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. అరెస్టు అయిన వారిలో బీఆర్ఎస్ నాయకులు ముడిగె రాజ్‌కుమార్, శెట్టి రజనీకర్, గుర్రాల మహేశ్, ఓంప్రకాశ్ తదితరులు ఉన్నారు.

మిస్సింగ్ కేసు నమోదు



భాస్కర్

వాజేడు : స్థానిక పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైనట్లు ఎస్సై ఎస్.రాజ్‌కుమార్ తెలిపారు. స్థానిక ఎస్సీ హాస్టల్‌లో వాచ్‌మన్‌గా పని చేస్తున్న చేతల భాస్కర్ ఈ నెల 12న రాత్రి 11.30 గంటలకు హనుమకొండలోని ఇంటికి వెళ్తానని చెప్పి బయలు దేరి ఇంటికి చేరలేదు. భార్య ప్రియాంక వాజేడుకు వచ్చి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కన్నాయిగూడెంలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు



కన్నాయిగూడెం : మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీ చేపట్టారు. తుపాకులగూడెం, ఏటూరు నాగారం మండలం నుంచి వచ్చి పోయే వాహనాలను స్థానిక ఎస్సై ఐనుగాల వెంకటేశ్ డ్రంకెన్ డ్రైవ్ చేపట్టారు. బ్రీత్ అనలైజర్ ద్వారా పరీక్ష చేసి ఆల్కహాల్ తాగిన వారికి ఫైన్ వేసినట్లు తెలి పారు. అనంతరం ఎస్సై వెంకటేష్ మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. మద్యం తాగి వాహనాలు నడపడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని తెలి పారు.

విద్యార్థుల ర్యాలీ



వెంకటాపురం(ఎం): ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని పాలంపేటలో కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులచే ర్యాలీ నిర్వహించినట్లు ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ సిహెచ్.శ్రీనివాస్, హెచ్‌ఎం వీరేందర్ తెలిపారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు నీటి వినియోగంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రేవతి, డాక్టర్ భవ్య, చైల్డ్ వెల్ఫేర్ అధికారి శిరీష, ఏఎన్ఎం సూర్యకాంత తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ



ములుగు రూరల్ : వేసవి ఎండల కారణంగా వడదెబ్బకు గురికాకుండా ఉపాధి కూలీలకు వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ మేరకు శనివారం మండలంలోని గట్టమ్మ ఆలయ సమీపంలో పనులు చేపడుతున్న ఉపాధి కూలీలకు ఆశా వర్కర్లు శిరీష, నీలా ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎండ తీవ్రత ఎక్కువ ఉన్న కారణంగా ఉదయం 11 గంటల లోపు ఇంటికి చేరుకోవాలని అన్నారు. వడదెబ్బకు గురైతే వెంటనే ఆస్పత్రికి వెళ్లి వైద్యులను సంప్రదించాలని సూచించారు. సుమారు 150 మందికి ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందించినట్లు వారు తెలిపారు.

పరీక్ష కేంద్రం తనిఖీ

రేగొండ: మండలంలో పదో తరగతి పరీక్షలు శనివారం రెండో రోజు కొనసాగాయి. రేగొండలో 180 మంది, రంగయ్యపల్లిలో 117 మంది విద్యార్థులు హాజరయ్యారు. మండల కేంద్రంలోని పరీక్ష కేంద్రాన్ని జిల్లా స్థాయి అబ్జర్వర్ సోమిరెడ్డి తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రం వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఎటు వెళ్లాలో తెలిసేదెలా?

- జగన్నాథపురం జంక్షన్ వద్ద ఏర్పాటు చేయని సూచిక బోర్డులు
- దారి తెలియక అయోమయానికి గురవుతున్న వాహనదారులు

వాజేడు : దూరప్రాంతాల నుంచి వాజేడు మండలం మీదుగా భద్రాచలం, ఛత్తీస్‌గఢ్, మధ్య ప్రదేశ్, మహారాష్ట్ర వెళ్లాలనుకునే వాహనదారులు, అదే విధంగా ఆయా ప్రాంతాల నుంచి వరంగల్, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లాలనుకునే వారు జగన్నాథపురం జంక్షన్‌కు రాగానే అయోమయానికి గురవుతున్నారు. హైదరాబాద్, భూపాలపట్నం 163 నంబర్ జాతీయ రహదారి కావడంతో వేగంగా వచ్చిన వాహనదారులు అక్కడి రాగానే భద్రాచలం, ఛత్తీస్‌గఢ్ వైపు వెళ్లడానికి ఎలాంటి సూచిక బోర్డులు లేవు. ఎటు వెళితే ఏ ఊరుకు వెళతామో తెలియక అయోమయానికి గురవుతున్నారు. ఎవరినైనా అడుగుదామంటే అక్కడ నిర్మానుష్య ప్రదేశం కావడంతో ఎవరు ఉండరు.

ఖాళీగా ఉన్న సూచిక బోర్డులు

దూరప్రాంతాల నుంచి వచ్చే వారు వేరే రాష్ట్రానికి గానీ, ఊరుకు గానీ వెళ్లాలనుకునే వారు ముందుగా సూచిక బోర్డుపై ఏమి రాసి ఉందో చూసి అది ఏ ఊరు, ఇంకా ఎంత దూరం ఉందో గుర్తిస్తారు. అక్కడి నుంచి ఎటు వెళ్లాలో యారో మార్కుతో సూచిస్తూ ఉంటుంది. దాని ఆధారంగా ఆ ఊరుకు వాహనాల్లో వెళ్తుంటారు. ఎక్కడి నుంచే వచ్చే వాహనదారులు జగన్నాథపురం జంక్షన్ వద్దకు రాగానే అయోమయానికి గురవుతున్నారు. ఇక్కడ సూచిక బోర్డులపై ఎలాంటి రాతలు లేకపోవడంతో ఎవరైనా వచ్చే వరకు ఆగి వివరాలను తెలుసుకుని వెళుతున్నారు.

బస్‌షెల్టర్‌లోని బల్లలు ఏమైనట్లు ?

దూర ప్రాంతాల నుంచి వచ్చే వారు, బస్సు కోసం చూసే వారు అక్కడ కొంత సమయం వేచి ఉండాల్సి వస్తుంది. రహదారి నిర్మాణ సమయంలో జగన్నాథపురం జంక్షన్ వద్ద రహదారికి రెండు వైపులా బస్‌షెల్టర్లను ఏర్పాటు చేశారు. అందులో ప్రయాణికులు కూర్చోవడానికి వీలుగా ఐరన్ బల్లలు అమర్చారు. కొన్ని రోజులు అవి ఉన్నప్పటికీ ఆ తర్వాత మాయం అయ్యాయి. అవి ఎవరు తీసుకెళ్లారో తెలియదు. బల్లలు లేకపోవడంతో ప్రయాణికులు బస్, ఇతర వాహనాలు వచ్చే వరకు మండుటెండలో నిల్చోవాల్సిన దుస్థితి నెలకొంటుంది.



ఎలాంటి సూచిక బోర్డులు లేని జగన్నాథపురం జంక్షన్



భద్రాచలం వైపు పేర్లు లేకుండా ఉన్న సూచికబోర్డు



బల్లలు లేకుండా ఉన్న బస్‌షెల్టర్

బోర్డులపై పేర్లు రాయాలి



జాతీయ రహదారి కావడంతో దూరప్రాంతాల నుంచి వాహనదారులు వస్తుంటారు. వారికి ఏ ఊరికి వెళ్లాలో తెలియాలంటే సూచిక బోర్డుపై ఊర్ల పేర్లు ఉండాలి. అధికారులు తప్పని సరిగా సూచిక బోర్డులపై పేర్లు ఉండేలా చూడాలి. – యాలం రామకృష్ణ, ప్రయాణికుడు

రైతు కుటుంబాలను ఆదుకోవాలి

- తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎండీ. అమ్జద్‌పాషా

ములుగు రూరల్ : జన్యుమార్పిడి మొక్కజొన్న విత్తనాలను సాగు చేసి దిగుబడి రాక అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడిన రైతు కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ.అమ్జద్‌పాషా డిమాండ్ చేశారు. శనివారం మొక్కజొన్న సాగు రైతులకు ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని వెంకటాపురం(కె), వాజేడు, కన్నాయిగూడెం, ఏటూరునాగారం మండలాల్లో సుమారు 1300 ఎకరాల్లో కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకొని మొక్కజొన్న సాగు చేశారని అన్నారు. సిజెంట, బేయర్, కావేరి కంపెనీల యాజమాన్యాలు ఏజెన్సీలో గిరిజన రైతులను మోసం చేసి జన్యుమార్పిడి పంటలను సాగు చేసేవిధంగా ప్రోత్సహించడంతో దిగుబడి రాక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని అన్నారు. పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 1.50 లక్షల నష్టపరిహారం చెల్లించాలని, ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందిన రైతు కుటుంబాలకు రూ. కోటి నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలతో పాటు జిల్లా ఉన్నతాధికారులు స్పందించి రైతులకు పరిహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో రైతులను సమీకరించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల, బహుళజాతి కంపెనీల విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అమ్జద్‌పాషా

ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలి

గోవిందరావుపేట : ఎయిడ్స్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వైఆర్‌జీ కేర్ లింక్ వర్కర్స్ స్కీం సంస్థ లింక్ వర్కర్ తప్పెట్ల కిషన్, ఐసీటీసీ కౌన్సిలర్ కుమార్ అన్నారు. మండలంలోని పాపయ్యపల్లి, బాలాజీనగర్, సంద్రగూడెం తండాల్లో శనివారం తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో మిషన్ 95 క్యాంపెయినింగ్ చేశారు. స్థానిక ప్రజలకు ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కల్పించారు. అనంతరం 59 మందికి హెచ్ఐవీ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెచ్ఐవీ నాలుగు విధాలుగా సోకుతుందన్నారు. సురక్షితం కాని లైంగిక సంబంధాలు, కలుషితమైన సూదులు, పరీక్షించని రక్త మార్పిడి వల్ల, హెచ్ఐవీ తల్లి నుంచి పుట్టబోయే బిడ్డకి ఈ నాలుగు మార్గాల ద్వారానే వస్తుందని తెలిపారు. ప్రతి గర్భిణీ తప్పకుండా హెచ్ఐవీ పరీక్ష చేయించుకోవాలని, ఒకవేళ గర్భిణీకి హెచ్ఐవీ పాజిటివ్ అని తెలిస్తే తల్లి నుంచి పుట్టబోయే బిడ్డకి ఎయిడ్స్ రాకుండా అందుబాటులో మందులు ఉన్నాయి అన్నారు. ప్రతి ఒక్క గర్భిణీ ఆస్పత్రిలోనే డెలవరీ అయ్యేటట్లు చూసుకోవాలని అన్నారు. ప్రతి టీబీ పేషెంట్ హెచ్ఐవీ పరీక్ష చేయించుకోవాలని అన్నారు. లింక్ వర్కర్ రాము, డ్రైవర్ రాజు పాల్గొన్నారు.



ఎయిడ్స్‌పై గ్రామ ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కిషన్, కుమార్

ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు



వెంకటాపురం(ఎం): చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ గిరిబాబు



ఎస్ఎస్‌తాడ్వాయి : చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వెంకటాపురం(ఎం): వేసవికాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాల ఏర్పాటు అని తహసీల్దార్ గిరిబాబు అన్నారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలకు వివిధ పనుల కోసం వచ్చే ప్రజలు చలివేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ విజేందర్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

నార్లాపూర్‌లో చలివేంద్రం ప్రారంభం

ఎస్ఎస్‌తాడ్వాయి : మండలంలోని నార్లాపూర్‌లో పంచాయతీ కార్యదర్శి ధర్మేందర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శనివారం కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. పార్టీ జిల్లా నాయకుడు తండాల శ్రీనివాస్ మాట్లాడుతూ వేసవి ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకుని పనుల నిమిత్తం నార్లాపూర్‌కు వచ్చే ప్రజల దాహం తీర్చేందుకు మంత్రి సీతక్క ఆదేశాల మేరకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు మొక్క శ్రీనివాస్, ఎస్సీ సెల్ మండల ఉపాధ్యక్షుడు పురుషోత్తం నారాయణ, వెంకన్న, భిక్షపతి, వంశీ, సత్యం పాల్గొన్నారు.

అకాల వర్షాలతో రైతుల్లో ఆందోళన

- మిర్చి తడవకుండా కాపాడుకునేందుకు పరుగులు
- మబ్బులు తేలిపోవడంతో ఊపిరి పీల్చుకున్న రైతులు

మంగపేట : మండలంలో అకాల వర్షాలకు మిర్చి రైతుల్లో ఆందోళన నెలకొంది. శుక్రవారం రాత్రి ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు పడడంతో రైతులు మిర్చి ఆరబెట్టిన కల్లాల వద్దకు పరుగులు తీశారు. రాష్ట్రంలో పలు చోట్ల వర్షాలు పడుతుండటంతో మిర్చి ఏరి కల్లాల్లో ఆరబెట్టి ఉంచిన రైతులు అప్రమత్తంగానే ఉన్నారు. అయినప్పటికీ అర్ధరాత్రి ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. ఉరుములు మెరుపులతో చిరుజల్లులు పడ్డాయి. ఆరుగాలం కష్టపడి పండించిన మిర్చి కల్లాల్లో ఉండటంతో వర్షానికి తడిసి పోకుండా కాపాడుకునేందుకు రైతులు ప్లాస్టిక్ టార్పాలిన్లు పట్టుకుని పరుగులు తీశారు. ఆరబెట్టి ఉంచిన మిర్చి తడిసిపోకుండా టార్పాలిన్లు కప్పారు. గతంలో గోదావరి, వాగు ఇసుకలో ఆరబెట్టిన మిర్చి ఒక్కసారిగా వచ్చిన వరదలకు కొట్టుకుపోయిన సందర్భాలు ఉన్నాయి. గోదావరి, వాగుల్లో ఆరబెట్టిన రైతులు ఎక్కడ భారీ వర్షాలు కురుస్తాయో అనే ఆందోళనకు గురయ్యారు. తెల్లవారు జాము వరకు చిరుజల్లులతో తేలికపాటి వర్షం పడి తెల్లవారేసరికి మబ్బులు తేలిపోవడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

చిరుజల్లులు ఆందోళనలో రైతులు

వాజేడు : మండలంలో శనివారం సాయంత్రం చిరుజల్లులు పడ్డాయి. దీంతో మిర్చి, వరి రైతులు భయాందోళనకు గురయ్యారు. భారీ వర్షం పడితే ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆందోళన చెందారు. మిర్చి కల్లాల్లో ఉన్న కాయలపై రక్షణ కోసం టార్పాలిన్ కవర్లను కప్పి భద్రపర్చారు. ఆరబోసిన మిర్చిపై సైతం కవర్లను కప్పి జాగ్రత్త చేశారు. ఆందోళన రేకెత్తించిన చిరు జల్లులు నిలిచిపోవడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.



వాజేడు: మిర్చిపై కప్పిన టార్పాలిన్ కవర్లు



వర్షపు నీటిని తొలగిస్తున్న రైతులు

ట్రిపుల్ రైడింగ్, ఓవర్ స్పీడ్‌పై కౌన్సెలింగ్

మంగపేట : రోడ్డుపై ట్రిపుల్ రైడింగ్, అతివేగంగా వాహనాలు నడిపే వారిపై దృష్టి సారించిన పోలీసులు కమలాపురంలో ట్రైనీ ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. పదో తరగతి పరీక్షల నేపథ్యంలో డ్రైవింగ్ లైసెన్సు లేకుండా మైనర్ విద్యార్థులు డ్రాపింగ్, పికప్ పేరుతో ఒక్కో వాహనంపై ముగ్గురు కలిసి అతివేగంగా నడుపుతూ వెళ్లే పలువురి విద్యార్థులను గుర్తించారు. విద్యార్థులను ఆపి వారితో పాటు వారి తల్లిదండ్రులకు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. మైనర్లకు ద్విచక్రవాహనాలు ఇచ్చి ప్రమాదాలకు కారకులు కావొద్దని సూచించారు. మైనర్లు ట్రిబుల్ రైడింగ్, అతి వేగంగా వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అత్యవసరం అయితే తల్లిదండ్రులు వారి పిల్లలను పరీక్ష సెంటర్‌కు తీసుకురావాలే తప్ప వాహనాలు ఎవరికీ ఇవ్వొద్దన్నారు.



విద్యార్థులు, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రైనీ ఎస్సై శ్రీకాంత్

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ఎస్ఎస్‌తాడ్వాయి : మండలంలోని మేడారం జంపన్నవాగు సమీపంలో ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం చోటు చేసుకుంది. బంధువుల కథనం ప్రకారం.. గోవిందరావుపేట మండలం ఎల్బీనగర్‌కు చెందిన సనప అశ్వపతి(40) ఈనెల 20 భార్యాపిల్లలతో కలిసి తాడ్వాయి మండలం మేడారంలోని బంధువుల శుభకార్యానికి వెళ్లారు. రెండు రోజుల నుంచి మేడారంలోనే ఉన్న అశ్వపతి రెడ్డిగూడెం సమీపంలోని జంపన్నవాగు పరిసర ప్రాంతంలో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి ఘటన స్థలాన్ని సందర్శించి ఆయన మృతిపై ఆరా తీశారు. ఈ విషయంపై ఎస్సైని అడగగా మృతుడి కుటుంబ సభ్యుల నుంచి ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు.

బెట్టింగ్‌లకు పాల్పడితే చర్యలు

- ఎస్సై టీవీఆర్ సూరి



మంగపేట: ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లపై యాప్స్‌ల ద్వారా ఎవరైనా బెట్టింగ్‌లు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్సై టీవీఆర్ సూరి హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో బెట్టింగ్ యాప్స్‌తో ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌లు పెట్టి లక్షల్లో డబ్బులు పోగొట్టుకుని అప్పుల పాలైన యువత ఆత్మహత్యలకు పాల్పడుతున్న సంఘటనలు చూస్తూనే ఉన్నామన్నారు. అలాంటి ఘటనలు జరుగకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రధానంగా తమ పిల్లలు ఏమి చేస్తున్నారనే విషయాన్ని ఎప్పటి కప్పుడు గమనించాల్సిన పూర్తి బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. అవసరాలకు మించి వారికి డబ్బులు ఇవ్వకూడదని సూచించారు. మండలంలో ఎక్కడైనా ఎవరైనా బెట్టింగ్‌లకు పాల్పడితే 100కు డయల్ చేయాలని, స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సరదాగా మొదలైన బెట్టింగ్ వ్యసనంగా మారుతుందన్నారు. మొబైల్ ఫోన్లలో బెట్టింగ్ యాప్ ఉన్నా, ఎలాంటి బెట్టింగ్ చర్యలకు పాల్పడినా వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గ్రామాల్లో బెట్టింగ్‌లకు పాల్పడే వారి సమాచారాన్ని అందించాలని సమాచారం ఇచ్చే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. సమాచారం అందించే వారికి పోలీస్ శాఖ తరఫున పారితోషికం అందిస్తామని ఎస్సై పేర్కొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

రేగొండ: పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లింల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు మత సామరస్యానికి ప్రతీక అని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మజీద్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని మతాలు ఒకటేనని ప్రజలంతా సోదర భావంతో ఉండాలన్నారు. ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ముస్లింలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ముస్లిం మత పెద్దలు ఎమ్మెల్యేను శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ అబ్దుల్ రజాక్, భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గూటోజు కిష్టయ్య, పీఏసీఎస్ చైర్మన్ నడిపల్లి వెంకటేశ్వరరావు, జిల్లా, మండల నాయకులు నాయినేని సంపత్‌రావు, పుల్లూరి బాబురావు, పున్నం రవి, సూదన బోయిన ఓంప్రకాశ్, పట్టెం శంకర్, షాబీర్ అలీ, మైస భిక్షపతి, ముద్దమల్ల రవి, ప్రేమాజీ, ఓమాజీ, కోయిల క్రాంతి, తరుణ్, ప్రవీణ్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే సత్యనారాయణరావును శాలువాతో సన్మానిస్తున్న ముస్లిం మతపెద్దలు

మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ



మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న నాయకులు

మొగుళ్లపల్లి: మొట్లపల్లి జెడ్పీఎస్ఎస్‌లో పదో తరగతి పరీక్షలు రాసి బయటికి వచ్చిన విద్యార్థులకు కాంగ్రెస్ పార్టీ గ్రామ మహిళా అధ్యక్షురాలు, అమ్మ ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్ చిలుకూరి కరుణదేవేందర్ రెడ్డి శనివారం మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు డ్యాగ రమేశ్, గూడూరి తిరుపతిరెడ్డి, జన్నే రవీందర్, వడ్డేపల్లి రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

చిట్యాల మండలంలోని శాంతినగర్‌కు వెళ్లే ప్రధాన రోడ్డు వెంట ఎండిన చెట్టు ప్రమాదకరంగా ఉంది. గాలిదుమారానికి ఎప్పుడు పడుతుందో తెలియని పరిస్థితి. నిత్యం ఆ రోడ్డు వెంట వాహనదారులు, పాదచారులు రాకపోకలు సాగిస్తుంటారు. సంబంధిత అధికారులు స్పందించి ఎండిన చెట్టును తొలగించి ప్రయాణికులకు ప్రమాదం జరుగకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.



– చిట్యాల

బాధిత కుటుంబాలకు పరామర్శ

చిట్యాల: మండలంలోని ఒడితల గ్రామానికి చెందిన మ్యాదరి సాంబలక్ష్మి, నలిమెల చంద్రయ్య, కొత్తపేటకు చెందిన మేకల చందు, జడలపేటకు చెందిన అడిదల సంజీవ రెడ్డి, రాంచంద్రాపూర్‌కు చెందిన సూర కుమారస్వామి ఇటీవల మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి శనివారం పరామర్శించారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ గొర్రె సాగర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అల్లం రవీందర్, మాజీ వైస్ ఎంపీపీ నిమ్మగడ్డ రాంబాబు, నాయకులు దొడ్డి శంకర్, పిట్ట సురేష్, రాజు నాయక్, పులి వెంకటేశ్, తదితరులు ఉన్నారు.

కొత్తపల్లిగోరిలో..

రేగొండ: కొత్తపల్లిగోరి మండల కేంద్రానికి చెందిన పల్లెబోయిన దేవరాజు అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతిచెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను శనివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిశిధర్ రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి, నాయకులు సూదనబోయిన విష్ణుయాదవ్ ఉన్నారు.

మంద కృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం



మల్హర్: ఎస్సీ వర్గీకరణ సాధించుకున్న నేపథ్యంలో మండల కేంద్రంలోని తాడిచర్లలో శనివారం మంద కృష్ణమాదిగ చిత్రపటానికి ఎమ్మార్పీఎస్ మండల నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో 30 సంవత్సరాలు రాజీలేని పోరాటం చేసి ముందుకు నడిపించిన మందకృష్ణ మాదిగకు మాదిగ సమాజం మొత్తం రుణపడి ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కేసారపు నరేష్, మండల ప్రధాన కార్యదర్శి తాండ్ర దినేష్, నాయకులు ఇందారపు సిద్ధు, ఇందారపు శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.